1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | ఆగస్టు 28, 2024 | www.navatelangana.com

## పాముకాటుతో మహిళ మృతి


పంచనామా రాస్తున్న పోలీస్

నవతెలంగాణ-గాంధారి

పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పేట్ సంగెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరంగం మనవ్వ (39) సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ఇంట్లోనే బియ్యం సంచిలో బియ్యం తీయడానికి చేతులు పెట్టగా అక్కడే ఉన్న గుర్తు తెలియని పాము కాటు వేయడంతో అది గమనించిన భర్త గంగారం ఆమెను హుటాహుటిన కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి 7:30 గంటల సమయంలో మృతిచెందింది. భర్త గంగారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.

## పరిసరాలను సందర్శించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని 19వ డివిజన్ లో మహాలక్ష్మి దేవాలయం వద్ద గతంలో డెంగ్యూ వచ్చి పూర్తిగా తగ్గిపోయిన వ్యక్తుల ఇంటి పరిసరాలను నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ మంగళవారం సందర్శించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే గా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాలలో మంచి నీరు నిలవ ఉంచరాదు అని, ఎప్పటికప్పుడు నీటి నిల్వ ఉంచే పాత్రలు శుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఆశా, అంగన్ వాడి కార్యకర్తలు జ్వరం సర్వే నిర్వహించారు. అనంతరం నాగారంలో గల డంపింగ్ యార్డ్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శాదుల్ల, జవాన్ రాజేశ్వర్, ఆశా వర్కర్లు చంద్రకళ శోభ, ఎఎన్ఎం సుశీల, ఆర్పీ సుమలత, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రభుదాస్ జవాన్లు ఉన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

### దళితుల భూములు

# స్వాహా చేస్తున్న భూస్వాములు

- రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్

నవతెలంగాణ-గాంధారి

పేద దళితుల భూములను స్వాహా చేసిన భూస్వాములపై రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరించడం సరికాదని, చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరం నాయక్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి మాతు సంగెం శివారులో గల సర్వే నెంబర్ 119, 175 లో దళితులు గిరిజనులు 40 కుటుంబాలు సుమారు 60 ఎకరాల భూమి గిరిజను దళితులు సాగు చేసుకుంటుంటే అక్కడ ఉన్న భూస్వామి సంగారావు రాజేందర్ రావు లాంటోళ్ల వారి మీద దాడికి పూనుకొని పోలీసుల కేసు పెట్టి ఆ భూమి నుంచి ఖాళీ చేయించారని తెలిపారు. తహసిల్దార్లు సర్వే చేసి ఎవరి భూములు వాళ్లకి అప్పగిస్తామని చెప్పి సంవత్సరాలు గడుస్తున్నా సర్వేకు నోచుకోవడం లేదని తెలిపారు. దళితులు మాత్రం కాళ్ల చెప్పులు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోందని అన్నారు. ఆ భూమి మీద ఎవరు కూడా పోవద్దని హెచ్చరించినా.. అవకాశం చూస్తూ సందర్భాను సారం రెండు ఎకరాలు చొప్పున చదును చేసుకుంటూ ఇతర గిరిజనులకు అమ్ముకుంటున్నాడని విమర్శించారు. ఇప్పటికే నాలుగు ఎకరాల పట్టా చూపించుకుంటూ 14 ఎకరాలు అమ్ముకున్నట్టు తెలిపారు. ఎవరైనా అడిగితే అదే పట్టా పాస్‌పోర్ట్ చూపిస్తున్నాడి అన్నారు. అయినా రెవెన్యూ అధికారులు మాత్రం మాకేమి సంబంధం లేనట్టుగా ఆ భూమి తోని మాకేం అక్కర లేనట్టుగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్ రెవెన్యూ అధికారులు వెంటనే ఆ భూమిని సర్వే నిర్వహించి పేద దళిత గిరిజనులకు పంచాలని డిమాండ్ చేస్తున్నామని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాములు, సంఘవా, స్వప్న సాయవ్వ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యాయత్నం

- తండ్రిపేరుపై ఉన్న భూమి బదలాయించడం లేదని
- ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట పురుగుల మందు సేవించిన వ్యక్తి

నవతెలంగాణ-రామారెడ్డి

రెవెన్యూ అధికారులతో తీరుతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తండ్రి పేరుపై ఉన్న వారసత్వ భూమిని కొడుకు పేరుపై మార్చాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగి వేసారిన ఓ వ్యక్తి అక్కడే పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని ఉప్పల్వాయి గ్రామానికి చెందిన మంత్రి భగవాన్‌కు తన తండ్రి మంత్రి మొగులయ్య పేరు పైన పోసానిపేట రెవెన్యూ గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 856 /68, ఒక ఎకరం భూమి తన పేరుపై నమోదు చేసుకునేందుకుకొన్ని రోజులుగా తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతున్నాడు. తండ్రి పేరుపై ఉన్న వారసత్వ భూమిని తన పేరుపై బదలాయించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బుతో ఆత్మహత్య ప్రయత్నం చేయగా, సిబ్బంది వెంటనే తేరుకొని మందు డబ్బా ను లాగేసుకున్నారు. ఎమ్మార్వో సువర్ణ ను వివరణ కోరగా.. సర్వే నెంబర్ 856 అసైన్డ్ భూమి అని, సర్వే చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


పురుగుల మందు డబ్బాను లాగేస్తున్న సిబ్బంది

### ప్రాణం తీస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలు

# రోగమొకటి.. వైద్యం మరోటి

- వచ్చీ రానీ వైద్యంతో ప్రజల ప్రాణం తీస్తున్న పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలు
- వారి పరిధికి మించి నరాలకు ఇంజక్షన్‌లు, గ్లూకోజ్‌లు ఎక్కిస్తున్న వైనం
- హెవీ డోస్ ఇంజక్షన్‌లు ఇస్తూ ప్రాణాలతో చెలగాటం
- వారం వ్యవధిలో నలుగురు మృత్యువాత
- ఘటన జరిగినప్పుడే స్పందిస్తున్న వైద్యాధికారులు
- ఆకస్మిక తనిఖీల జాడే కరువు



నవతెలంగాణ-భిక్కనూర్

ఆర్ఎంపీ, పీఎంపీ కేంద్రాలు.. కేవలం ప్రథమ చికిత్స అందజేసే కేంద్రాలు. కానీ పలువురు ఆర్ఎంపీలు, పీఎంపీలు వారి పరిధికి మించి చికిత్సలు అందజేస్తున్నారు. ఏదైనా సమస్యతో ఆస్పత్రికి వెళ్తే.. ముందుగా ఓ ఇన్‌జక్షన్ ఇవ్వడంతో పాటు గ్లూకోజ్‌లు పెట్టి పంపిస్తున్నారు. వచ్చీ రాని వైద్యంతో హెవీ డోస్ ఇంజక్షన్‌లు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తమ పరిధికి మించిన వైద్యం చేస్తుండటంతో పలువురు రోగులు ప్రాణాలు వదులుతున్నారు. ఇంత జరుగుతున్నా.. వైద్యశాఖ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఘటన జరిగినప్పుడు వచ్చి తనిఖీలు చేపట్టి అప్పటికప్పుడు సదరు కేంద్రాలను సీజ్ చేసి మమ అనిపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టిన జాడే లేదు. దీంతో పలువురు ఆర్ఎంపీలు, పీఎంపీలు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

వైద్యఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం.. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 959 మంది ఆర్ఎంపి, పీఎంపీలు రిజిస్టరై ఉన్నారు. నిబంధన ప్రకారం ఈ ఆర్ఎంపి, పిఎంపీలు గ్రామస్థాయిలలో కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలి. రోగి అనారోగ్యం పాలైన, గాయాలైన అప్పటికప్పుడు ప్రథమ చికిత్స అందజేసి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి ఉంటుంది. కానీ గ్రామాలలో, పట్టణాల్లో ఉండే ప్రథమ చికిత్స కేంద్రాలలో రోగివస్తే చాలు 2 సూదులు- 4 గ్లూకోస్ బాటిల్ ఎక్కించి ఆసుపత్రికి సంబంధించిన మెడికల్ షాపులలో హెవీడోస్ మందులు రాస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటవాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వారం రోజుల వ్యవధిలోనే ఆర్ఎంపీ, పీఎంపీ సెంటర్‌ల వైద్యంతో నలుగురు మృత్యువాత పడటం గమనార్హం.

**వారం వ్యవధిలో నలుగురు మృత్యువాత**

అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం. సాధారణ జ్వరం ఏదో, సీజనల్ వ్యాధులేవో డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ఎక్కువగా సోకుతుంటాయి. జ్వరంతో సెంటర్‌కు వచ్చే వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలు లేకుండానే రెండు ఇంజక్షన్‌లు, నాలుగు గ్లూకోజ్‌లు పెడుతున్నారు. జ్వరం తగ్గిపోతుందిలే అని బుకాయించి వేలాది రూపాయలు దండుకుంటున్నారు. కానీ ఎంతకూ జ్వరం తగ్గకపోగా.. ప్రాణాల మీదకు వచ్చి ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వారం వ్యవధిలో నలుగురు మృత్యువాత పడటం గమనార్హం. లింగంపేట్, భిక్కనూర్, సదాశివనగర్ మండలాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలల తీరుతో నలుగురు మృత్యువాత పడటం గమనార్హం. అందులో ఇద్దరు పిల్లలున్నారు.

**వైద్యారోగ్యశాఖ నిఘా కరువు**

ప్రథమ చికిత్స కేంద్రాలు, ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యం నిర్వహించే చోటా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిఘ నామమాత్రం గానే ఉన్న కారణంగా గ్రామస్థాయిలో ఉండే కొందరు ఆర్ఎంపి, పిఎంపీలు వారు చేసిందే వైద్యం ఇచ్చిందే మందులు అన్న చందంగా తయారైంది. ప్రథమ చికిత్స కేంద్రాల కారణంగా రోగుల ప్రాణాలు పోతున్న సమయంలో పగడ్బందీగా నిఘా ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపి, పిఎంపీ లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ సంబంధం లేనట్టు వ్యవహరించడం పరిపాటిగా మారింది. ప్రాణాలు పోయిన తర్వాతనే ఆగమేఘాల మీద ఆస్పత్రిలోని సీజ్ చేయడం విమర్శలకు తావిస్తుంది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే రోగుల ప్రాణాలు కాపాడచ్చని ప్రజలు తెలియజేస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ ప్రథమ చికిత్స కేంద్రాలలో కేవలం ప్రథమ చికిత్స సేవలు నిర్వహించి రోగి ప్రాణాలు కాపాడే బాధ్యతల్లో భాగంగా ఆర్ఎంపి, పిఎంపీలు ప్రథమ చికిత్స సేవల నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం పెద్ద ఆస్పత్రికి లేదా ప్రభుత్వాసుపత్రులకు రోగులను పంపాలని వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. రోగులు వస్తే హెవీడోస్ మందులు, ఇంజక్షన్లు, గ్లూకోస్ లు ఎక్కించకుండా జాగ్రత్తలు పడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

**ఇంజక్షన్ లేనిదే వైద్యం చేయరు..**

వైద్యం కోసం రోగులు తమ చికిత్స కేంద్రాలకు వస్తే చాలు ఆర్ఎంపి, పిఎంపి వైద్యులు నరాలకు ఇంజక్షన్లు చేస్తూ హెవీడోస్ మందులు అందజేస్తు న్నారు. ఇంజక్షన్ లేనిదే వైద్యం చేయకపోవడం గమనార్హం. కొంచం బీపీ తక్కువగా ఉంటే రెండుకు మించి గ్లూకోజ్‌లు పెడుతూ.. ఆస్పత్రులను మించి దోపిడీకి పాల్పడుతున్నారు. అమాయకుల ఆర్థిక బలహీనతను ఆసరా చేసుకొని.. పెద్దాస్పత్రికి వెళ్తే.. వేలాది రూపాయలు ఖర్చవుతాయని, తమ వద్ద అయితే తక్కువలో వైద్యం అందుతున్నట్టు బుకాయిస్తుంటారు. కేంద్రాల పక్కన ఉండే మెడికల్ షాప్‌లో మందులు దొరికే విధంగా చూసుకొని మందులు రాయడం గమనార్హం. పూర్తి వైద్యం తెలియని కొందరు ఆర్ఎంపీలు వచ్చిరాని వైద్యంతో వైద్యం చేస్తూ ప్రాణాలు తీస్తున్నారు.


భిక్కనూర్‌లో ఆర్ఎంపీ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

**ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి**



ప్రథమ చికిత్స కేంద్రాలలో వైద్య సేవలు నిర్వహిస్తున్న ఆర్ఎంపి, పిఎంపీల సెంటర్‌లలో నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు నిర్వహిస్తే తనిఖీల సమయంలో బయటపడితే చర్యలు తప్పవని డిఎంహెచ్వో చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రథమ చికిత్స సేవలైన గాయాలకు కట్టుకొట్టడం, చిన్న చిన్న వైద్య సేవలు వంటి చికిత్సలు మాత్రమే చేయాలని తెలిపారు. ఐవీలు, ఇంజక్షన్లు చేయరాదని తెలిపారు. నిత్యం తనిఖీలు జరుగుతున్నాయని తనిఖీలలో అక్రమాలు బయటపడితే చర్యలు తప్పవని తెలిపారు.

డిఎంహెచ్ఓ చంద్రశేఖర్

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఆర్ఎంపి, పిఎంపీలపై చర్యలు తీసుకోవాలి**



వైద్యం కోసం ప్రథమ చికిత్స కేంద్రాలకు వస్తున్న రోగుల విషయంలో నిర్లక్ష్యంగా వైద్యం చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపీ, పిఎంపిలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. వచ్చిరాని వైద్యంతో ప్రాణాలను బలికొన్న ఆసుపత్రులను ఎట్టి పరిస్థితిలో అనుమతులు ఇవ్వవద్దని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి ఆర్ఎంపి, పిఎంపి ఆసుపత్రులను తనిఖీ చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

వెంకట్ గౌడ్ (సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి)

**ఘటన జరిగినప్పుడే వైద్యశాఖాధికారుల హడావుడి**

కాగా ఏదైనా ఘటన జరిగినప్పుడే వైద్యశాఖ అధికారులు స్పందిస్తున్నారని, మిగతా సమయాల్లో అసలు పట్టించుకోవడం లేదని ఆకస్మికతనిఖీలు మరిచినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లింగంపేట్ మండలంలోని భయంపల్లి కిషన్‌నాయక్ తండాలో జ్వరంతో కెతావత్ చౌహాన్ వీరేందర్ లింగంపేట్‌లోని రాహుల్ క్లినిక్‌లో చికిత్స పొందాడు. కాగా పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. దీంతో స్పందించిన అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేయగా.. విస్తుగొలుపే విషయాలు వెలుగు జూశాయి. సదరు ఆర్ఎంపీ సెంటర్‌లో ఏకంగా ఆపరేషన్ థియేటర్ ఉండటం గమనార్హం. అదే విధంగా భిక్కనూర్ పట్టణంలో సైతం స్వామి అనే వ్యక్తి మృతిచెందగా.. ఆయనకు ట్రీట్‌మెంట్ అందజేసిన ఆర్ఎంపీ క్లినిక్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. కాగా సదాశివనగర్ మండలం పద్మాజీవాడిలో పీఎంపీ వైద్యుడి తీరుతో ఇద్దరు పిల్లలు మృత్యువాత పడ్డారు. హెవీ డోస్ ఇంజక్షన్‌లు ఇవ్వడంతో పిల్లలు మృతిచెందారు. ఒకరు మృతిచెందినప్పుడు వైద్యాధికారులు స్పందించి ఉంటే మరోబాలుడు మృత్యువాత పడకుండా ఉండేవాడని తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తమ పరిధికి మించిన చికిత్స అందజేస్తున్న క్రమంలో రోగులకు తీవ్ర అస్వస్థతకు గురైన సమయంలో పెద్దాస్పత్రికి తీసుకెళ్లాలని సదరు ఆర్ఎంపీలు, పీఎంపీలు సూచిస్తుండటం గమనార్హం. తీసుకెళ్లే క్రమంలో మధ్యలోనే మృత్యువాత పడుతున్నారు.

# జీజీహెచ్ డైట్ టెండర్ వాయిదా

- పాత కాంట్రాక్టర్‌కు వంతపాడుతున్న ఆస్పత్రి అధికారుల తీరుపై కలెక్టర్ సీరియస్..?

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి) లో రోగులకు, వైద్యులకు భోజనం అందించేందుకు నిర్వహించిన 'డైట్' టెండర్ వాయిదా పడింది. వివరాల్లోకి వెళ్తే.. కాంట్రాక్టు గడువు ముగియడంతో ఇటీవల టెండర్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా.. మొత్తం 11 మంది ఔత్సాహికులు టెండర్‌లు దాఖలు చేశారు. స్క్రూట్నీలో ఐదుగురి టెండర్‌లను అధికారులు తిరస్కరించారు. మరో ఆరుగురితో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఇది వరకు డైట్ సప్లయ్ చేసిన కాంట్రాక్టర్‌తో అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సప్లయ్ తీరుపై ఆరా తీశారు. సదరు కాంట్రాక్టర్‌పై ఏమైనా ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయా అని అడగగా.. ఎలాంటివి లేవని ఆస్పత్రి వైద్యాధికారులు తెలిపారు. ఈ సమయంలో మరో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ కల్పించుకొని.. నాణ్యమైన భోజనం సరఫరా చేయడం లేదని పత్రికల్లో కథనాలు వచ్చాయని, ప్రజావాణికి ఫిర్యాదులు సైతం అందినట్టు తెలపగా.. ఆస్పత్రి అధికారులు మౌనం వహించారు. పనితీరు బాగుందంటూ జీజీహెచ్ అధికారులు తెలపడం పట్ల పలు అనుమానాలకు తావు ఇచ్చినట్టయింది. ఇదే సమయంలో.. సదరు కాంట్రాక్టర్ పాత కాంట్రాక్టర్ పేరుతో టెండర్ దక్కించుకొని రెండేండ్ల నుంచి డైట్ సరఫరా చేస్తున్నట్టు టెండర్‌దారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సుమారు 12 ఏండ్ల పాటు వై శ్రీనివాస్ అనే వ్యక్తి డైట్ సప్లయ్ చేయగా.. 2022 నుంచి అదే పేరుతో మరో వ్యక్తి సరఫరా చేస్తున్నట్టు టెండర్ దారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జీజీహెచ్ అధికారులు, పాత కాంట్రాక్టర్ కుమ్మక్కైనట్టు ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. కాగా 23వ తేదీన నిర్వహించిన స్క్రూట్నీకి అనుమతి లేకుండా ఖమ్మం ఏడీ రావడంపై సమావేశంలో చర్చ జరిగినట్టు సమాచారం. జీజీహెచ్ అధికారుల తీరుపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆగ్రహం వ్యక్తిచేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో డైట్ టెండర్‌ను వాయిదా వేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.

నాణ్యమైన భోజనం సరఫరా చేసేందుకు అన్ని అంశాలపై పర్యవేక్షణ చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా సరఫరా చేసేవారికే టెండర్ అందజేయనున్నట్టు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

### కట్టుదిట్టమైన చర్యలతో

# సీజనల్ వ్యాధుల నియంత్రణ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి తనిఖీ
- మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం


ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టంగా కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలను, ఫీవర్ వార్డు, ఆపరేషన్ థియేటర్, శస్త్ర చికిత్స వార్డు, రక్త నిధి కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, ఎలిసా టెస్ట్ సెంటర్, టీ.హబ్ సెంటర్ తదితర వాటిని సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ప్రతి రోజూ సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు. డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటి వాటితో ఎంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ ను అడిగి తెలుసుకున్నారు. రోగుల అవసరాలకు సరిపడా మందులు, ప్లాస్మా, ప్లేట్ లెట్ యూనిట్స్ అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. ఆయా విభాగాల వారీగా అందిస్తున్న వైద్య సేవల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్యాసదుపాయల గురించి వాకబు చేశారు. బ్లడ్ సాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షించిన అనంతరం రోగులకు అందిస్తున్న రిపోర్టులు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఓ.పీ రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడమే కాకుండా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. సీజనల్ వ్యాధుల తీవ్రతను దృష్టిలో పేరుకుని జీజీహెచ్ లో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. జీజీహెచ్ తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, సీహెచ్సీలు, పీహెచ్సీలలో ప్రత్యేకంగా ఫీవర్ వార్డులను నెలకొల్పి సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలను కూడా రోజువారీగా తెప్పించుకుని, వారికి అందిస్తున్న వైద్య సేవలను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులచే నిశితంగా పర్యవేక్షణ జరిపిస్తున్నామని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్య చికిత్సలకు నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. జీజీహెచ్ లో మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, ఉన్నారు.

# సమస్యల సుడిగుండాల్లో సంక్షేమ హాస్టళ్లు

- ప్రభుత్వం చిన్నచూపు తగదు : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమస్యల సుడిగుండంలో సంక్షేమ హాస్టల్లో కొట్టుమిట్టాడుతున్నాయని, వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి చిన్న చూపు తగదని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపి సంక్షేమ హాస్టల్‌లను సంరక్షించాలని ధర్నా నిర్వహించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్ సంరక్షణపై ఈనెల 23 నుండి 26 వరకు నగరంలోని ప్రభుత్వ స్కూల్లో,ప్రభుత్వ హాస్టల్స్, పాలిటెక్నిక్, కళాశాలలో, డిగ్రీ కళాశాలలో సర్వేలు నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో వచ్చిన ప్రధాన సమస్యలకు సంబంధించి ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, ప్రతి సంక్షేమ హాస్టల్ లో వాటర్ ప్యూరిఫైయర్స్ ని ఏర్పాటు చేసి తాగునీటి సమస్యనూ ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కోటగల్లి ఇంటర్మీడియట్ కళాశాలలో దాదాపుగా 1000 మంది విద్యార్థులు చదువుకుంటే ఇంగ్లీష్ మీడియం తెలుగు మీడియం విద్యార్థులను ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను కనీసం 3000 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్స్ లో నివసిస్తున్న విద్యార్థులకు స్కాలర్షిప్స్ ప్రభుత్వమే భరించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం ఆరు నెలలుగా విడుదల చేయడం లేదని, నిత్యవసర సరుకులను గ్రీన్ ఛానల్ లో పునరుద్ధరణ చేసి సకాలంలో ప్రభుత్వం విడుదల చేయాలనీ అన్నారు. అద్దె భవనాలలో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలను నిర్మించాలని అన్నారు. అదే విధంగా గర్ల్స్ హాస్టల్‌కి శానిటరీ న్యాప్కిన్స్ హెల్త్ కిట్లను ప్రభుత్వం అందించేటట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపుతాం అని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారనీ అన్నారు. వీటిని పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ అధ్యక్షురాలు దీపిక, జిల్లా కమిటీ సభ్యులు దినేష్, రాజు, శ్రావణ్ ,కార్తీక్, వినీత్, జేశన్, అల్తమస్,మున్న, సమీర్ , తదితర నాయకులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## 29న జాబ్ మేళా

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 29న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి.పి మధుసూదన్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు వరుణ్ మోటార్స్ కంపెనీ వారు ఎగ్జిక్యూటివ్, రేలషన్ షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్, ఉద్యోగాల కోసం అర్హతలు డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ పాసైనా యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. జాబ్ లొకేషన్ నిజామాబాద్, ఆర్మూర్‌లో ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీనగర్‌లో ఈనెల 29న ఉద్యోగ మేళాకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం లోపు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9581768413, 9948748428, 6305743423, 77022 59070 ఫోన్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట బయోడేటా, ఆధార్‌కార్డు, పదోతరగతి మెమో, ఫోటో తీసుకురావాలని సూచించారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- ఎంపీడీఓ సంతోష్ కుమార్


మాట్లాడుతున్న ఎంపీడీఓ

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జాగిర్యాల్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా గ్రామపంచాయతీ రికార్డును తనిఖీ చేసిన అనంతరం పారిశుధ్యం, వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లతో, మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులతో కలిసి డోర్ టు డోర్ వెళ్లి పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి అర్చనను ఆదేశించారు.

## దాతలు ఎల్లప్పుడూ ముందుండాలి


పంపిణీ చేసిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

**నవతెలంగాణ-ఆర్మూర్**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, వారికి చేయూత ఇవ్వడానికి దాతలు ఎల్లప్పుడూ ముందుండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత అన్నారు. మండలంలోని కోమన్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడాభిమాని అయిన అంకాపూర్ గ్రామానికి చెందిన గడ్డం అనంత్‌రెడ్డి 50 జతల ఆటల యూనిఫాంలను విద్యార్థులకు ఉచితంగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా నైపుణ్యాన్ని కనబరచాలని శారీరక దారుఢ్యం పై శ్రద్ధ చూపాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండడం శరీరానికి మంచి ఆరోగ్యాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి కోకిల నాగరాజు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, జనార్ధన్, వినోద్, చిన్నయ్య గోపాల్, రాగ సుధ, లక్ష్మిబాయి, అనంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

## ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

భీంగల్ మండలానికి బదిలీపై వచ్చిన నూతన ఎస్సై జీ మహేష్‌ను అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీకి చెందిన తాండవాసులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సేవాలాల్ నాయక్, వల్లి నాయక్, శంకర్ నాయక్, ఆకాష్, సంతోష్, రాజిరెడ్డి, రవినాయక్, శ్రావణ్, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్‌లు వాడొద్దు


ప్లాస్టిక్ రహిత బ్యాగులను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

లయన్ సహారా ఆధ్వర్యంలో మహాలక్ష్మి చికెన్ సెంటర్ 28వ వార్షికోత్సవ సందర్భంగా ఆర్యనగర్ నిజామాబాద్‌లో ప్లాస్టిక్ సంచులకు బదులు 'నేను ప్లాస్టిక్‌ను కాను' అనే నినాదంతో కూడిన 90 రోజులలో కరిగిపోయే సంచులను నిజామాబాద్ కార్పొరేషన్ కమిషనర్ మకరంద్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. దీని గురించి నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ లయన్ సహార అధ్యక్షుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే లయన్స్ క్లబ్ సహారా ముఖ్యమైన కమర్షియల్ షాప్‌లలో సమావేశాలు నిర్వహించి ప్రజల కొరకు మంచి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో లయన్ జిల్లా కార్యదర్శి ఉదయ సూర్య భగవాన్, కోశాధికారి ధనుంజయ రెడ్డి, సభ్యులు కపిల్, రమేష్ షాప్ యజమాని గుణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్‌డబ్ల్యూ తనిఖీ


సమావేశంలో పాల్గొన్న అధికారులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ డి.జి ఆదేశాలమేరకు ఐ.ఎస్.డబ్ల్యూ వారి ఆధ్వర్యంలో తనఖీ నిర్వహించాలని ఆదేశాలు రావడంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనవార్ సూచనల మేరకు నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హైదరాబాద్ నుండి వచ్చిన ఐ.ఎస్.డబ్ల్యూ (డి.యస్.పి) ఆర్.నాగేశ్వరరావు వారిబృందం ఆధ్వర్యంలో పి.యస్.ఓలు, బిడి టీమ్, డాగ్ స్క్వాడ్, ఎమ్.టి విభాగాలలో మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది విధుల నిర్వాహణ, సిబ్బంది ఫిజికల్ ఫిట్‌నెస్, అన్ని రకాల పరికరాల ఉపయోగం, మెయింటెనెన్స్, డాగ్‌స్క్వాడ్ విధులు, బి.ఆర్ వాహనం మెయింటెనెన్స్‌పై పలు విషయాలపై చర్చించారు. విధినిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించరాదని తెలిపారు. సిబ్బందికి ఎలాంటి సందేహాలు ఉనా.. తమ పై అధికారికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి (ఎ.ఆర్) డి.శంకర్ నాయక్, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ హెచ్.సతీష్, ఎమ్.టి.ఓ తిరుపతి, ఆర్.ఎస్.ఐ శ్రావణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# నార్మల్ డెలివరీలు చేయాలి

- ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి
- ప్రభుత్వాస్పత్రి తనిఖీ

**నవతెలంగాణ-ఆర్మూర్**


ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గర్భిణులకు నార్మల్ డెలివరీలు మాత్రమే చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కలియ తిరిగి బెడ్స్, ల్యాబ్, కిచెన్ ఇతర వార్డులను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని అన్నారు. గర్భిణులకు ప్రత్యేకంగా కుర్చీలు కేటాయించాలని, వారికి ఇబ్బంది లేకుండా చూడాలని డాక్టర్లను కోరారు. సాధ్యమైనంత వరకు ప్రభుత్వ దావఖానాలో మందులు ఉంటున్నాయని లేనియెడల జనరిక్ మందులు మాత్రమే రాయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులు మాత్రం ఎక్కువ శాతం పేదవారు ఉంటారని వారికి సరైన వైద్యం అందించి భరోసా కల్పించాలని గర్భిణులకు నార్మల్ డెలివరీ వల్ల ఉపయోగాలు, నార్మల్ డెలివరీ కోసం చేసే ఎక్సర్‌సైజులు తెలపాలని మహిళా వైద్యురాళ్లకు సూచించారు. ఎక్కువ శాతం నార్మల్ డెలివరీ చేయాలన్నారు. చిన్న పిల్లలకు వైరల్ ఫీవర్ లాంటివి రాకుండా డాక్టర్లు తగు జాగ్రత్తలు చెప్పాలని, ఎక్స్‌రే మిషన్లు లేకుండా పేషెంట్ ఇబ్బంది చెందుతున్నారని వైద్యులు తెలిపారు. హాస్పిటల్లో వసతులు ఏమేమి అవసరమో నివేదిక ఇవ్వాలని వైద్యులను కోరారు. ప్రతి నెలకోసారి ఆస్పత్రిని తనిఖీ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాల్సిందే

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**



ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎస్ నాయకులు

రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏ.ఓకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మూడు దఫాలుగా రుణమాఫీ చేస్తున్నామని కేవలం వడ్డీ మాత్రమే మాఫీ చేసిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేసే సమయంలో కొద్దిమంది రైతులకు మాత్రమే 2 లక్షల రూపాయలు మాఫీ చేసిందని మిగిలిన వారికి బ్యాంకులలో టెక్నికల్ ప్రాబ్లం పేరుతో బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చిన ప్రకారం రైతులందరికీ రెండులక్షల మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వై.రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్, జిల్లా నాయకులు కే.రాజన్న, బొంబాయి గంగారాం, రవి, బాబు, రాధాకుమార్, ముల్తాన్, సురేష్, కాలిక్ పాల్గొన్నారు.

## అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలపై సన్నాహక సమావేశం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**


మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఆంధ్రయ్య

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలో అంతర్ పాఠశాల క్రీడోత్సవాల నిర్వహణపై చర్చించేందుకు మండల విద్యాధికారి ఆంధ్రయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. 2024-25 విద్య సంవత్సరానికి గాను అంతర్ పాఠశాలలకు క్రీడోత్సవాలను కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో కమ్మర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. క్రీడల కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం వ్యవహరిస్తారని ఎంఈఓ ఆంధ్రయ్య తెలిపారు. మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాలను సెప్టెంబర్ 26, 27, 28 తేదీలలో నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. ఐదు సంవత్సరాల విరామం అనంతరం మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, ప్రధాన కార్యదర్శి సూకల బుచ్చి మల్లయ్య, ఉపాధ్యక్షులు నిమ్మ రాజేంద్రప్రసాద్, గణేష్, ఎంఎన్ఓ గంగాధర్, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రారంభం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ (ఎంఏ/ఎంకాం/ఎంఎస్‌డబ్ల్యూ/ఎమ్మెల్సీ/ఎంబీఏ/ఎంసీఏ) రెండవ సెమిస్టర్, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ (ఏపీఈ/ ఐపిసిహెచ్/ ఐఎంబిఏ/) ఎనిమిదవ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ బి.ఎల్ఐఎస్సి రెండవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తెలంగాణ వర్సిటీ మెయిన్ క్యాంపస్, తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ భిక్కనూర్, గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కె గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ బాన్సువాడ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో ప్రారంభమయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో జరిగిన పరీక్షను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి సందర్శించి పరిశీలించారు. ఉదయం జరిగిన పరీక్షలకు మొత్తం 1808 మంది విద్యార్థులకు 1687 విద్యార్థులు హాజరయ్యారు. 121విద్యార్థులు గైరాజయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలియజేశారు.

**బి.ఎడ్.రెగ్యులర్ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫీజు తేదీ ప్రకటన..**

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బి.ఎడ్. రెగ్యులర్ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫీజు 04 సెప్టెంబర్ తేదీలోపు చెల్లించాలని 100 రూపాయల అపరాధ రుసుముతో 05 సెప్టెంబర్ వరకు చెల్లించవచ్చునని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో పొందుపరిచినట్టు సూచించారు.

## ఏఎంసి వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం


ఏఎంసీ వైస్ చైర్మెన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-బోధన్**

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పదవీ బాధ్యతలు చేపట్టిన చీల శంకర్‌ను మంగళవారం బోధన్ పట్టణంలో వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఇటీవల జిల్లా కోర్టుకు ఇంచార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన శ్యామ్‌రావును, జంగమ లింగాయత్ సమాజ్ కమిటీ సభ్యులు, ప్రముఖులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర దేశాయ్ మాట్లాడుతూ ఏకకాలంలో లింగాయత్ సమాజ్ సభ్యులకు ఇలాంటి గౌరవాలు దక్కడం చాలా హర్షించదగ్గ విషయమని, సమాజంలోని ప్రతి వ్యక్తి ఎదుగుదలకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యామ్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శీల శంకర్ మాట్లాడుతూ.. తాము ఈ రోజున ఈ స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని అన్నారు. లింగాయత్ సమాజ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ జంగమ లింగాయత్ సమాజ్ ప్రముఖులు వెంకటేశ్వర దేశాయ్, శివకుమార్ అప్ప, బాబాయ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, నర్సింగప్ప, గంగారం, కర్నే శ్రీను, మాధవ్‌రావ్‌పటేల్, శ్యామ్ రావు, పురాణే దిలీప్, పురానే శివానంద్, అనిల్, బోధన్, సాలూర మండల గ్రామాల ప్రముఖులు లక్ష్మణ్, వీరేష్, కుమార్, శ్రీకాంత్, శివరాజ్, శివకాంత్, మాధవ్ తదితర ప్రముఖులు ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న యూనియన్ నాయకులు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్మెందర్ అన్నారు. నగరంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదులో భాగంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్ పాత పెన్షన్ విధానానికి కట్టుబడి ఉందని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాకా ఉద్యమిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇష్టంలేని ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన సంఘం ప్రాథమిక సభ్యులను సన్మానించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బెల్లాల్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ (వాసు), జిల్లా ఆర్థిక కార్యదర్శి అఫ్జల్ బేగ్, నగర అధ్యక్షులు సన ఉద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు, రమాదేవి, గంగయ్య, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండలో చైన్‌స్నాచింగ్


**నవతెలంగాణ-బాల్కొండ**


బాధితురాలు

చైన్ స్నాచర్లు ఓ మహిళ మెడలోంచి బంగారం గొలుసును అపహరించుకుపోయారు. ఈ ఘటన మంగళవారం బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని నెహ్రూనగర్ కాలనీకి చెందిన దుగ్గెం వనజ అనే మహిళ ఉదయం తన పిల్లలను స్థానికంగా ఉన్న మదర్ థెరిస్సా పాఠశాలలో వదిలేసి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఆమెను చిరునామా అడిగే సాకుతో మాట్లాడించి ఆకస్మాతుగా ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంపుకొని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలు వనజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**


సాయన్న (ఫైల్)

ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గన్నారం గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన వేల్పూర్ సాయన్న 60 గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కృష్ణాష్టమిని పురస్కరించుకొని వేడుకలను తిలికించడానికి వెళ్లగా.. వ్యక్తి మనస్థాపంతో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడుకి భార్య, కుమారుడు, కూతూరు ఉన్నారు. మృతుని భార్య వేల్పూర్ సాయవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

## ప్రేమవిఫలమై యువకుడు ఆత్మహత్య


సునీల్ మృతదేహం

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ప్రేమ పేరుతో మోసపోయిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో కుమార్ గల్లికి చెందిన సునీల్(22) ఓ యువతిని గతంలో ప్రేమించాడు. అయితే ప్రేమ విఫలమై సోమవారం రాత్రి తన జనరల్ షాపులోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఒకటో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిచ్‌పల్లి ఎడిఈ జి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/కెవి ఫీడర్ సిర్నపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి, మేగ్యానాయక్ తాండా, డొంకల్, కోటల్‌పల్లి గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఇందల్‌వాయి టీజీ ఎన్పిడిసిఎల్ ఏఈ పండరినాథ్, ఎల్లారెడ్డిపల్లి ఏఈ జ్ఞానేశ్వర్ కోరారు.

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**నవతెలంగాణ-వర్ని(చందూర్)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌బిఎస్‌కె ఆధ్వర్యంలో 30 రోజుల పాటు 5వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు కంటి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు వైద్యులు తెలిపారు. మంగళవారం మండలంలోని ఘన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అంధత్వ నివారణ సంస్థ (ఆర్‌బీఎస్‌కె) ఆధ్వర్యంలో స్కూల్ పిల్లల కంటి పరీక్ష శిబిరాల్లో భాగంగా డా.హాసన్నుల్లా, డా.అఫ్తాలిముఖ్ కంటి పరీక్షలు నిర్వాహించారు. ఒక విద్యార్థికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. విద్యార్థికి కళ్లజోడు ఆశావర్కర్ల ద్వారా సమకూర్చనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎమ్.రమేష్, ఫార్మాసిస్ట్ సుమలత, ఏఎన్ఎం వసంత, ఉపాధ్యాయులు సంధ్యరాణి, శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్డు పనులు



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయకులు

**నవతెలంగాణ-మద్నూర్**

జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు కృషితో ఐదు లక్షల నిధులతో మంజూరైన మండలంలోని చిన్న తడగూర్ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులు పెద్ద తడగూర్ కొండావార్ రాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పనులను చిన్న తడగూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గంగారాం, బాలాజీ ,శంకర్, మాధవరావు పటేల్, తుకారం, తడుగూరు నాగనాథ్, తదితరుల పరిశీలించారు.

## సమాజ నిర్మాణంలో గురువుల పాత్రం కీలకం



ఉపాధ్యాయులను సన్మానించిన కమిటీ సభ్యులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలంలోని పోసానిపేట మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని, గురువు లేని విద్య గుడ్డి దేనని అభివర్ణించారు. ఎక్కడ వెళ్లినా పేద విద్యార్థుల కోసం, మెరుగైన సమాజం కోసం ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ పాలకవర్గం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మేలుకో
# ఓటరుగా నమోదు చేసుకో

- ఓటరు నమోదుకు మరో అవకాశం
- ప్రారంభమైన బోగస్ కార్డుల ఏరివేత
- స్థానిక ఎన్నికలకు సమాయత్తం

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

స్థానిక సంస్థల ఎన్నికల క్రమంలో ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు మరో అవకాశమిచ్చింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల చేయగా, బోగస్ ఓటర్లను ఏరివేసేందుకు ఈ నెల 20 నుంచి ఇంటింటా సర్వే చేపట్టాలని బీఎల్ వోలను ఆదేశించింది. ఈ క్రమం లో కలెక్టర్ ఆదేశాలు జారీ చేయగా అధికార యంత్రాంగం సదరు పనుల్లో నిమగ్నమైంది. స్థానిక సంస్థల్లో యువత పాత్ర కీలకం. ఇప్పటికైనా ఓటరుగా నమోదు కాని యువత ఓటే తూటాగా ముందుకు సాగాల్సిన తరుణమిది. ఓటరు జాబితాలో పేరుందో లేదో చూసుకుని అప్రమత్తమవడం అత్యవసరం. గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లు తమ ఓటు తొలగించారని గగ్గోలు పెట్టిన ఘటనలు అనేకం. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో ఓటుందా, లేదా అనేది ఒక్కసారి సరిచూసుకోండి. లేకుంటే వెంటనే నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



**ప్రారంభమైన ఏరివేత..**

ఈ నెల 20నుంచి బోగస్ ఓట్లను ఏరివేయనున్నారు. బూత్ లెవల్ అధికారులు(బీఎల్వో) వారివారి బూత్ పరిధిలో ఓటరు జాబితాతో ఇంటింటా వివరాలను ఆరాతీయనున్నారు. అనుమానమున్న ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించనున్నారు. అలాగే మరణించినవారు, వలసవెళ్లినవారి పేర్లను తొలగిస్తారు.

**ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు..**

ఓటరుగా నమోదు కావాలనుకు నేవారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం-6 తీసుకు ని అందులో వివరాలు పొందుపరిచి అక్కడే కార్యాలయం లో సమర్పించాలి. ఆధార్ కార్డు, ఇంటి చిరునామాను సూచించే కరెంట్ బిల్లు, ఇతరత్రా ఏదేని ఆధారాన్ని జత చేయాల్సి ఉంటుంది. బీఎల్ వోలు క్షేత్రస్థాయిలో విచారించి ఓటరుగా నమోదు చేయనున్నారు.

**పలు మార్గాలు..**

గ్రామ పంచాయతీ క్యాంపెయిన్ కు వెళ్లలేనివారు అరచేతిలోనే ఓటరు గా నమోదు కావచ్చు. http:/// voters.eci.gov.in వెబ్‌సైట్ నుంచి సైతం అందులో సూచించిన వివరాల ఆధారంగా నమోదు చేసుకోవచ్చు. సర్వీస్ పోర్టల్‌లో ముం దుగా మొబైల్ నంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఫారం-6, జాబితా నుంచి పేరు తొలగింపునకు ఫారం-7, తప్పొప్పుల సవరణకు ఫారం-8, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కోసం ఫారం-6బి కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివ రాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.

**యాప్ తో కూడా..**

బీఎల్వో వద్దకు వెళ్లలేని వారు వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్లో voter helpline mobile App యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా.. లేదా చూసుకునే అవకాశం కల్పించారు.

**గుర్తింపు కార్డు పొందడమిలా..**

ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు https:/// voters. eci.gov.in వెబ్సైట్లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే రాదు. ఫారం - 8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు.

## కలెక్టర్ ఆదేశాలతో గేటు బిగింపు



గేటును బిగిస్తున్న సిబ్బంది

**నవతెలంగాణ-బిచ్కుంద**

బిచ్కుంద మండలంలో ఈనెల 23న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటన సందర్భంగా మండల కేంద్రంలో కమ్మరి చెరువు వద్ద గల పల్లె ప్రకృతి వనం సందర్శించారు. పల్లె ప్రకృతి వనం వెళ్లే దారిలో అడ్డంగా బోర్డు ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ వెంటనే బోర్డు తొలగించి గేటు ఏర్పాటు చేయాలని, ఎండిపోయిన మొక్కలను తొలగించి కొత్త మొక్కలు నాటాలని చుట్టుపక్కల చెత్తాచెదరం లేకుండా శుభ్రం చేయించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లె ప్రకృతి వనం వెళ్లే దారిలో అడ్డంగా ఉండడంతో బోర్డును తొలగించి గేటును బిగించారు. చుట్టూరా ఉన్న చెత్తాచెదారిన్ని తొలిగించి ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ గోపాలకృష్ణ, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

## ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం

**నవతెలంగాణ-మద్నూర్**

మద్నూర్ మండల కేంద్రంలోని నడిమి హనుమాన్ ఆలయాభివృద్ధికి ఓ వ్యక్తి రూ.లక్ష విరాళం అందజేసినట్టు స్థానికులు తెలిపారు. కాగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడిమి హనుమాన్ ఆలయ అభివృద్ధికి దాదాపు కొన్ని లక్షల రూపాయలు ఖర్చు అయింది. ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి పరుస్తూ మంగళవారం ఆలయంలో ప్రత్యేకంగా అభిషేక పూజలు భజన కార్యక్రమం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అభిషేక పూజలకు ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి దాత ముందుకు వచ్చినప్పటికీ పనులు చేయించడంలో వంకాయల వార్ సంజు మేస్త్రి ముందుండి పనులు నిర్వహించినట్టు స్థానికులు తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని భూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డిప్యూటీ జిల్లా వైద్య అధికారి చంద్రశేఖర్ సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్మా అఫ్షిన్ లక్ష్మీ పతి ఉపాద్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలకు హైడ్రాను విస్తరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

**నవతెలంగాణ-కామారెడ్డి**

హైడ్రాకు తమ పూర్తి మద్దతు ఉందని, అదే విధంగా జిల్లా కేంద్రాలతో పాటు మండల, గ్రామాలకు సైతం విస్తరించాలని జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) జిల్లా అధ్యక్షులు మర్రి మహిపాల్ కోరారు. కలెక్టరేట్ ఎదుట మంగళవారం హైడ్రాకు సంఘీభావం తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ భాస్కరరావు, బురిగారి నర్సింలు, కన్వీనర్ రవీందర్ రెడ్డి, బిబిపేట్ అధ్యక్షులు సాయికుమార్, డైరెక్టర్ గంగరాజు, బిక్నూర్ అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు సందీప్, మాచారెడ్డి అధ్యక్షులు భరత్, ఉపాధ్యక్షులు నర్సింలు, రాజంపేట్ అధ్యక్షులు శ్రీకాంత్, ఎన్ హెచ్ ఆర్ సి సభ్యులు గొల్లపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ పర్యటన



మాట్లాడుతున్న అధికారులు

**నవతెలంగాణ-సదాశివనగర్**

మండలంలోని ఆదర్శ పాఠశాలను, బీసీ హాస్టల్‌ను, రైతు వేదికను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, మండల ప్రత్యేక అధికారులు సతీష్ యాదవ్, రమేష్ బాబు, డీఎల్‌పీవో శ్రీనివాస్ మండల అధికారులు అందరూ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన సాయిరాం

**నవతెలంగాణ-నిజాంసాగర్**

కరెంట్ షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని వెల్గనూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాధరి సాయిరాం(36) సోమవారం రాత్రి 8 గంటల సమయం లో తన పంట పొలంలో నీరు పారించేందుకు వెళ్లాడు. బోరు మోటర్ నడవక పోవడం వలన బోర్ మోటర్‌ను మరమ్మతులు చేసేటప్పుడు ప్రమాదవశాత్తు కరెంట్ వైర్ తగిలడంతో కరెంట్‌షాక్‌కు గురై అక్కడే మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

## ఆయుష్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం



వృద్ధులకు వైద్యం చేస్తున్న వైద్యులు

**నవతెలంగాణ-మద్నూర్**

మద్నూర్ మండలంలోని పెద్ద తడగూర్ గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఆయుష్ ఆదేశాల మేరకు... ప్రభుత్వ హెూమియో పతి వైద్యశాల మద్నూర్ (కామారెడ్డి) తరపున వృద్దుల వైద్య శిబిరం డాక్టర్ మానస (హెూమియోపతి, డాక్టర్ ఉమాదేవి (ఆయుర్వేద) ఆధ్వర్యంలో నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాదిగ్రస్తులు, ఆస్తమా, జ్వరాలు, చర్మ వ్యాదులు, అర్శమొలలు తదితర వాటికి పరీక్షలు నిర్వహించి ఉచితముగా ఔషదాలు పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఔషధాల వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. సుమారు 100 మందికి పైగా మందులు పంపిణీ చేసినట్టు డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ మానస తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్, ఫార్మసిస్ట్ భార్గవి, ఎస్ ఎన్ ఓ మహేందర్, గ్రామ ఆరోగ్య రక్షణ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

- మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి

**నవతెలంగాణ-కామారెడ్డి**



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ

మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అనిమున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నేడు పర్యావరణ మొత్తం కాలుష్యంతో నిండిపోతుందని అందువల్ల మనకు ఆక్సిజన్ కావాలంటే మొక్కలు నాటి సంరక్షించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గల డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, తమకు పట్టాలు రాలేదని చైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆమె మంగళవారం డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద నీటి సమస్యను తీర్చడానికి బోర్ బండిని తెప్పించి కొబ్బరి కొట్టి బోర్ వేయించారు. అనంతరం ఆమె డబల్ బెడ్ రూమ్‌లో ఆవరణంలో మొక్కలను నాటారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుందున ప్రతి ఒక్కరు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. త్వరలోనే పై అధికారులతో చర్చించి ఇండ్ల పట్టాలు వచ్చేటట్టు చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు, పాత శివ కృష్ణమూర్తి, పంపరి లతా శ్రీనివాస్, వనిత రామ్మోహన్, మాజీ కౌన్సిలర్ జూలూరు సుధాకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు

**నవతెలంగాణ-నిజాంసాగర్**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో గల ప్రాథమికోన్నత పాఠశాల ఉర్దూ మీడియం, ప్రాథమిక పాఠశాల నిజాంసాగర్ క్యాంప్ పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎం రామచందర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రగతి, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు నమోదు పరిశీలించినట్టు తెలిపారు. బేస్ లైన్ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను, మార్కుల నమోదు ప్రక్రియను ప్రధానోపాధ్యాయులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరును డి ఎస్ ఏ, ఎఫ్ ఆర్ ఎస్ రోజు ఉదయం 9:30 లోపు ఆన్లైన్ లో పొందుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల యొక్క ప్రగతిని తరగతి వారీగా పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి వ్యక్తిగత శుభ్రత పై వారికి పలు సూచనలు చేశాడు.అనంతరం పాఠశాలలోని బియ్యం నిల్వలను రిజిస్టర్ లో ఉన్న విధంగా ఉన్నావా లేవని సరి సరి చూడడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సిఆర్పి బి.శ్రీధర్ కుమార్, పి.నర్సింలు ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లాయక్ ఉన్నిసా బేగం, యాస్మిన్ బేగం ప్రాథమిక పాఠశాల నిజాంసాగర్ క్యాంప్ ప్రధానోపాధ్యాయులు రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోకులాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణుని వేషాధారణలో అలరించిన చిన్నారులు

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/నాగిరెడ్డిపేట్**



పెద్దకొడప్‌గల్‌లో...

మండలంలోని పలు తండాలలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలలో పోచారం తండాలో పెద్దలు యువకులు చిన్నారులు ప్రజలు పాల్గొని శ్రీ కృష్ణ చిత్ర పటానికి తాండ వాసులు కొబ్బరికాయలు కొట్టి తీపి నైవేద్యంతో పూజలు చేసిన అనంతరం ఉట్టి కార్యక్రమన్నీ తాండ వాసులు నిర్వహించారు. చిన్నారులతో ఉట్టి వేడుకలు నిర్వహించగా, చిన్నారులంతా చిన్ని కృష్ణుని వేషా ధారణతో హుషారుగా పాల్గొని ఈలలు వేస్తూ ఉట్టి కొడుతూ కేరింతలు వేస్తూ హుషారుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు ,యువకులు తాండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపేట్ :** నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో మంగళవారం రోజు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కృష్ణుడి వేషంతోపాటు చిన్నారులకు గోపికల వేషధారణ చేసి మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వంజరి వెంకన్న, సంతోష్, మాణిక్యం, తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్: వివిధ వేషాధారణలో చిన్నారులు

## సభ్యత నమోదు చేపట్టాలి

**నవతెలంగాణ-లింగంపేట్**

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలలో పదివేల పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని భారతీయ జనతా పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం బాణాల లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం లింగంపేటలోని పెద్దమ్మ గుడిలో సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. మండలంలో 41 గ్రామ పంచాయతీలకు గాను మండల మొత్తం ఎనిమిది నుంచి పదివేల సభ్యత్వం చేయాలని ముఖ్య నాయకులకు అతిథులు దిశా నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాసుల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్సాని దత్తు రాములు, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్, సీనియర్ నాయకులు బొల్లారం సాయిలు, చేపూరు పోశెట్టి, అందాల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి

**నవతెలంగాణ-లింగంపేట్**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది

లింగంపేట్ మండలం, మోతె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై మంగళవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లా బాల రక్ష భవన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సిబ్బంది పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం వలన పిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని, వాటి నుంచి ఏవిధంగా బయటపడాలి, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురంచి వివరించారు. బాల్యవివాహాల నివారణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు మరియు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహనా కల్పించారు. బాలల హక్కులకు భంగం కలిగినప్పుడు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు .కృష్ణప్రసాద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రజితారాణి,జయశ్రీ,శ్రీనివాస్,విశాల్ కుమార్, హసన్, విజయ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | ఆగస్టు 28, 2024 | www.navatelangana.com



## జీపీ రికార్డులు పరిశీలించిన ఎంపీడీవో



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని కిసాన్ తండా గ్రామంలో ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్ గ్రామపంచాయతీ రికార్డులను మంగళవారం పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కార్యదర్శి సాయిబాబును ఆదేశించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించిన ఆయన ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కార్యదర్శిని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ప్రతి కుటుంబం ఇంటి వద్దనున్న పెరట్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ భర్త విజయ్ ఉన్నారు.

## ప్రతిభ స్కూల్ విద్యార్థులకు క్షేత్రస్థాయి పర్యటన



**నవతెలంగాణ-సిరికొండ**

మండలంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపులో ప్రతిభా స్కూల్ విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. పెట్రోల్ నాణ్యతను డెన్సిటీ ఏ విధంగా తెలుసుకుంటారో ప్రత్యక్షంగా విద్యార్థులు పరిశీలించారు. పెట్రోల్ పంపులు వినియోగదారులకు అందిస్తున్న సేవలు, వారు కల్పిస్తున్న సౌకర్యాలను గురించి విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు పెట్రోల్ పంపు మేనేజర్ కొరట్పల్లి నరసయ్య అన్ని వివరాలు తెలియజేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ప్రత్యేకంగా సందర్శించడంతో చాలావరకు పెట్రోల్ పంపు గురించి తెలుసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుంకం హరీష్, ప్రధానోపాధ్యాయుడు అశోక్, గైడ్ టీచర్ ప్రీతి, మైనిరెడ్డి, ప్రశాంత్, పిఈటి శశికుమార్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## లంబాడ పోరాట సమితి మండలాధ్యక్షుడిగా వెంకటేష్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

బంజారా లంబాడ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు సునావత్ వెంకటేష్‌ను నియమిస్తున్నట్లు లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహాన్ మోహన్ నాయక్ మంగళవారం తెలిపారు. అలాగే బంజారా మండల ప్రధాన కార్యదర్శి బాణావత్ సింగం అలియాస్ మోహన్‌కు జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో లంబాడ కుల పోరాటం సమితి జిల్లా అధ్యక్షులు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ.. చౌహాన్ మోహన్ నాయక్‌కు ఎల్లవేళలా బంజారా సంఘం తరపునుంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో లంబడా కుల పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయ కళాకారిణుల ప్రతిభ

- నృత్యంలో అంతర్జాతీయ స్థాయి పురస్కారం




నృత్యంలో పాల్గొన్న కళాకారిణీలు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

మండల కేంద్రానికి చెందిన శ్రీ పరమేశ్వర నృత్య కళానిలయ కళాకారిణులు నాట్యంలో తమ ప్రతిభను చాటి అంతర్జాతీయ స్థాయి నృత్య పురస్కారాన్ని అందుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం మహతి ఆడిటోరియంలో మంగళవారం సిటిజన్స్ వెల్ఫేర్ ఫోరమ్ అండ్ ప్రైడ్ ఇండియా కల్చరల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి నృత్య సంబరాలు, అంతర్జాతీయ స్థాయి పురస్కారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ పరమేశ్వర నృత్య కళా నిలయంలో శిక్షణ పొందుతున్న కళాకారుణిలు బేతు మనస్విని, ఉట్నూర్ శివాని, సున్నం అభిజ్ఞ, జొన్నల నమ్రత, రేండ్ల సుదీక్ష, యామ భువనేశ్వరి, కోరే మధుశ్రీ, కోటా రిషిత, అడిచర్ల లరణ్య, పున్నబోయిన చైత్ర, జంగం రిషిప్రియ అద్భుతమైన నృత్య ప్రదర్శనతో తమ ప్రతిభ చాటారు. కళాకారుణుల నృత్య ప్రతిభకు మంత్రముగ్ధులైన నిర్వాహకులు అభినందించి అంతర్జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేశారు. కళాకారుణిలు అద్భుతమైన నృత్య ప్రదర్శన ఇచ్చినందుకు గాను వారికి శిక్షణను ఇచ్చిన గురువు గంట శిరీషను శ్రీకృష్ణ నృత్య కాళీమా అవార్డుతో సత్కరించారు. జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను అందజేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

**నవతెలంగాణ-మాక్లూర్**

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నోట్ పుస్తకాలు, పెన్నులను లయన్స్ క్లబ్ నిజామాబాద్ నేత ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ.. సుమారు 500ల నోట్ పుస్తకాలు, పెన్నులు పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారని, మంచిగా చదివి అభివృద్ధి చెందాలని పాఠశాలకు లయన్స్ క్లబ్ నిజామాబాద్ నేత ఆధ్వర్యంలో పంపిణీ చేసినట్టు తెలిపారు. లయన్స్ క్లబ్ నిజామాబాద్ నేత అధ్యక్షులు కే మురళి మాట్లాడుతూ సమాజంలో ఉన్న వివిధ రంగాలలో ఉచితంగా ప్రజలకు సేవలు చేయడంలో ముందుంటామని, ప్రభుత్వ పాఠశాలలో అవసరాలు సౌకర్యాలు తీర్చడంలో ముందుంటామని తాము చేసే కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని తెలిపారు. నవనీత విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. లయన్స్ క్లబ్ నిజామాబాద్ నేత సభ్యులు రవీందర్, తులసీదాసు, ధర్మరాజు, నవనీత, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్ష

**నవతెలంగాణ-బోధన్**

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల శాంతియుత నిరసన దీక్షను బుధవారం చేపట్టనున్నట్టు, కావున సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ ఈ నిరసన దీక్షలో తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా నాయకులు సీఆర్పీ విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో పొందుపర్చిన విధంగా తక్షణమే సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు చేపట్టే శాంతియుత నిరసన దీక్షలో జిల్లాలోని ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగులు, డీపీవో ఉద్యోగులు, మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, మెసేంజర్లు, కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్పీలు, పాఠశాల స్థాయిలో పనిచేసే పార్ట్ టైం' ఇన్స్ట్రక్టర్లు, భవిత కేంద్రాలలో పనిచేసే ఐఈఆర్పీలు, సీజీవీలు శాంతియుత నిరసన దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

# దాతలు ఆదుకోరూ..

- జీవితాన్ని ప్రసాదించండి
- ప్రమాదంలో గాయపడ్డ అభాగ్యుడి ఆవేదన
- దాతల సహాయం కోసం ఎదురుచూపులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

'అనుకోని ప్రమాదంలో గాయపడ్డ. చికిత్సలకు ఆరు లక్షలకు పైగా కుటుంబీకులు వెచ్చించారు. ప్రస్తుతం కుటుంబ ఆర్థిక పరిస్థితి సైతం అంతంతే. దాతలు స్పందించి ఆదుకొని నాకు మరో జీవితాన్ని అందించండి' జ్ఞానేశ్వర్ వేడుకుంటున్నాడు. దాతలు సహాయం చేయాలని కోరుతున్నాడు.

వివరాలిలా ఉన్నాయి.. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన చింతం జ్ఞానేశ్వర్ 2014లో అనుకోని విధంగా ఒక ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ప్రమాదంలో వెన్నుపూస విరిగింది. ఆ సమయంలో అత్యవసరంగా భావించి డాక్టర్లు రెండు రాడ్లు వేశారు. అందులో ఒకటి ప్రస్తుతం విరిగిపోయింది. వాటిని తీసి మళ్ళీ వేరే రెండు రాడ్స్ 2 కేజీలు వేసి 2 ఆపరేషన్లు చెయ్యాలని డాక్టర్లు సూచించారు. వాటికి ఖర్చు రూ.6లక్షల పైవరకు అవుతుందని డాక్టర్ వెల్లడించారు. దీంతో ఆ అభాగ్యుడు చేసేదేమీ లేక దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.



బాధితుడు జ్ఞానేశ్వర్

జ్ఞానేశ్వర్‌కు అమ్మ, నాన్న, చెల్లెలు ఉన్నారు. చెల్లి ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. నాన్న పెరాలిసిస్ పేషెంట్. ఏ పనీ చేయలేడు. అమ్మ మాత్రమే ఇంటి పూట గడవటం కోసం కష్టపడుతోంది. అమ్మ వ్యవసాయ కూలీ, ఆర్థికంగా చాలా వెనుకబడిన కుటుంబం కావడంతో ఆరు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించే స్థితిలో ఆ కుటుంబం లేదు. బాధితుడు మొదటగా హైదరాబాద్‌లోని నిమ్స్, ఎయిమ్స్ ఆస్పత్రులకు వెళ్లాడు. ఆసుపత్రులలో డాక్టర్లు 'ఈ కేసును తాము తీసుకోలేమని, ఎలాంటి చికిత్స చేయలేం. ముందు ఆపరేషన్ ఎక్కడ చేశారో అక్కడే చేయించుకోవాలి.' అని డాక్టర్లు సలహా ఇచ్చినట్లు జ్ఞానేశ్వర్ చెప్పారు. ప్రస్తుతం జ్ఞానేశ్వర్ పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని దాతలు ముందుకువచ్చి ఆర్థిక సాయం చేసి అండగా నిలవాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేసేవారు 9949975391 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# గంజాయి సరఫరా చేస్తూ అమ్మకం

- వ్యక్తుల అరెస్టు
- 700 గ్రాముల గంజాయి పట్టివేత

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

రెండు ప్రాంతాలలో అక్రమంగా గంజాయి సరఫరా చేస్తూ అమ్ముతున్న వ్యక్తులను ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు తెలిపారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు ఏఈఎస్ ఎన్ఫోర్స్మెంట్ చంద్ర బాన్‌నాయక్ పర్యవేక్షణలో ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మంగళవారం నిజామాబాద్, నవీపేట్ రైల్వే స్టేషన్ ఏరియాలలో ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నాందేడ్ నుండి నిజామాబాద్, నవీపేట్‌కు ఎండు గంజాయి సరఫరా చేస్తు అమ్ముతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు కేసులు నమోదు చేశారు. నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకోగా.. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 450 గ్రాముల ఎండు గంజాయిని, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నవీపేట్‌లో ఒక కేసులో ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని నిందితుడు వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో సిఐ వెంకటేష్, ఎస్ఐ నరసింహాచారి, సిబ్బంది నారాయణరెడ్డి, విష్ణు, అవినాష్, భోజన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

# షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నాయకుల ధర్నా

**నవతెలంగాణ-వర్ని(మోస్రా)**

తెలంగాణ రాష్ట్ర రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ మారుతీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీకి 31వేల కోట్ల నిధులు అవసరం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 18 వేల కోట్లతో రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.15వేలు రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో రైతులకు రుణాలు రీ-షెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, రాజయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

# స్టూడెంట్ కౌన్సిల్ బాడీ ఎన్నికలు

**నవతెలంగాణ-మాక్లూర్**

మండలంలోని దాస్‌నగర్ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నిజామాబాద్‌లో స్టూడెంట్ కౌన్సిల్ బాడీ ఎలక్షన్స్‌ను మంగళవారం ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సుమారు 7 విభాగాలలో కెప్టెన్, వైస్ కెప్టెన్, జూనియర్ కెప్టెన్లను (21 నాయకులను) విద్యార్థులు కళాశాలలో వారి ఓటు హక్కును వినియోగించుకుని, సమర్థులైన నాయకులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సరిత, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు, అధ్యాపకులు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థి

# కనీస వేతనాల అమలుకై 30న ఛలో ఎస్‌పిడి కార్యాలయం

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్, వర్కర్లకు బేసిక్ పే అమలు కోసం, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే చలో ఎస్.పీ.డీ, (హైదరాబాద్) కార్యాలయం పిలుపును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ముఖ్యంగా కాలేజీలుగా అప్‌గ్రేడ్ ఐన కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. రిటర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వంట పాత్రలు ఇతర సామగ్రిని సరిపడా కొత్తవి అందించాలన్నారు. డ్యూటీచార్ట్ అమలు చేసి, పనిభారం తగ్గించాలన్నారు. కంప్యూటర్ ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎంలకు నైట్ డ్యూటీలు తగ్గించాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి బదిలీలు చేపట్టాలన్నారు. గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీ మేరకు నాన్ టీచింగ్, వర్కర్లను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పై డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న యూనియన్ ఆధ్వర్యంలో చలో ఎస్.పి.డి (హైదరాబాద్) ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ వర్కర్లు ఈ పిలుపును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యు జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, మోహన్ కేజీబీవీ, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ సిబ్బంది సుజాత, గీత, దుర్గ, సుజాత, మంజుల, వనిత, లలిత, పార్వతి, జమున, అనురాధ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

## మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఎం చిన్నయ్య



మాట్లాడుతున్న ఏపీఎం చిన్నయ్య

**నవతెలంగాణ-రెంజల్**

డ్వాక్రా మహిళా సంఘం గ్రూపులలో మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ఐకెపి ఎపిఎం చిన్నయ్య స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన వీవోఏలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి కింద మండలానికి 62 పాడి పశువులు మంజూరు అయినట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. డ్వాక్రా గ్రూపు రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. శ్రీనిధి కింద తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి స్వరూప, సీసీలు భాస్కర్, శివకుమార్, శ్యామల, సునీత, రాజయ్య, కృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా, అకౌంటెంట్ శారద, 31 మంది గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 29న గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రిన్సిపాల్ నళిని



**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 29న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ నళిని పేర్కొన్నారు. ఈ నెల 29న ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఎంపీసీలో రెండు ఎస్సీ కేటగిరి, బైపీసీలో ఎస్సీ కేటగిరి 1, బీసి కేటగిరీలో ఒకటి ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు కళాశాలకు వచ్చే సమయంలో తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని సూచించారు.

## తాడ్‌బిలోలిలో ఆవు చోరీ

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో గుర్తుతెలియని దుండగులు ఆవులను దొంగతనం చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఇటీవల బోర్గం, వీరన్నగుట్ట గ్రామాలలో సైతం 10 నుంచి 20 వరకు ఆవులను దొంగతనం చేసినట్టు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

## గాజుల శ్యాంకుమార్‌కు డాక్టరేట్ ప్రదానం




డాక్టరేట్ అందుకుంటున్న గాజుల శ్యాంకుమార్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి గాజుల శ్యాం కుమార్‌కు డాక్టర్ సత్యనారాయణరెడ్డి మావురపు పర్యవేక్షణలో "డిజైన్, సింథసిస్ అఫ్ నావెల్ హెటెరోసైక్లిక్ సమ్మేళనాలు యాంటీ క్యాన్సర్ ఏజెంట్లు, వాటి మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు అనే అంశంపై పరిశోధన జరిపారు. మంగళవారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణంరాజు, ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై విస్తృతమైన, విఫలమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ అడిగిన అన్ని ప్రశ్నలకు పరిశోధక విద్యార్థి ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ పరిశోధన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ పరిశోధనలో రూపకల్పన చేసి నావెల్ హేటెరో సైక్లిక్ సంశ్లేషణ మాలిక్యులర్లు క్యాన్సర్ ఏజెంట్స్‌ను గతం కంటే వేగంగా నివారించడానికి మార్గం సుగమ మైనదని పేర్కొన్నారు. రాబోయే రోజులలో ఈ పరిశోధన ఫలాలతో వేగవంతమైన, నాణ్యమైన, మేలైన డ్రగ్స్ తయారు చేయవచ్చునని పేర్కొన్నారు. అతి తక్కువ ఖర్చుతో అత్యంత వేగంగా క్యాన్సర్ నివారించడానికి ఫార్మా-డ్రగ్స్‌ను ఏ విధంగా తయారు చేయాలో తెలిపారు. ఈ పరిశోధన ఫలాల వలన ప్రజలకు అతి తక్కువ ధరలకు డ్రగ్‌ను అందించవచ్చునని పేర్కొన్నారు. శ్యామ్ అందించిన జవాబులకు బహిరంగ మౌఖిక పరీక్షకు హాజరైన ఆచార్యులు సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీ ప్రధానానికి ఆమోదం తెలిపారు. ఈ పరిశోధన కొరకు జరిగిన ప్రయోగంలో రుజువైన ఫలితాలతో రాసిన మూడు వ్యాసాలు ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయ ప్రమాణాలున్న అత్యధిక ఇంపాక్ట్ ఫ్యాక్టర్ కలిగిన జర్నల్స్ ప్రచురించడం ఈ పరిశోధనకు మరింత గుర్తింపు వస్తుందని ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ కృష్ణంరాజు పరిశోధకుడిని అభినందించాడు. ఈ బహిరంగ మౌఖిక పరీక్షకు ఫార్మసిటికల్ కెమిస్ట్రీ అధిపతి డాక్టర్ వాసం చంద్రశేఖర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ బోయపాటి శిరీష, పర్యవేక్షకులు డా. సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ప్రసన్న శీల కాంటాక్ట్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని నాగులూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కాటేవాడి తండాకు నాలుగు కోట్ల అరవై లక్షల రూపాయలతో మంజూరైన బీటీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా తండా వాసులు ఎదురుచూస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో తండా వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్న పోతంగల్ గ్రామం నుండి కాటేవాడి తండా వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డును పనులు ప్రారంభించారు.


కొనసాగుతున్న రోడ్డు పనులు

## రుద్రూర్ జెఎన్‌సి కాలనీ అక్రమ భూకబ్జా

- తహసీల్దార్‌కు కాలనీవాసుల ఫిర్యాదు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

మండలంలోని జెఎన్‌సి కాలనీలో కొట్బాల నవీన్ అనే వ్యక్తి అక్రమంగా భూకబ్జా చేస్తున్నాడని జెఎన్‌సి కాలనీవాసులు సూరజ్ శ్రీనివాస్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా భూకబ్జా చేయటం తప్పు అని నిలదీసిన వారిపై భూకబ్జాదారుడు దాడులకు పాల్పడుతున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే కొట్బాల నవీన్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలని తహసీల్దార్‌ను కోరారు.



# అల్లరి చేష్టలు.. ఆహ్లాద భరితం..

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు పోటీపడ్డ యువకులు
- అంబరాన్నంటిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ జిల్లాలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని స్కూళ్లలో వేడుకలు చేపట్టారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా ముస్తాబై అలరించారు. కృష్ణుడు గోపికల అల్లరి చేష్టలతో ఆహ్లాదభరితంగా వేడుకలు కొనసాగాయి. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా.. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు.


ఆర్మూర్‌లో...






బాల్కొండలో..


బోధన్‌లో..


రెంజల్‌లో..


కంఠేశ్వర్: ఉట్టి కొడుతున్న యువకులు


గాంధారిలో..


సిరికొండలో..


జక్రాన్‌పల్లిలో..


రెంజల్‌లో..

## అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించాలి
- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ఉదయం మున్సిపల్, ప్రజా ఆరోగ్య శాఖ అధికారులతో, మధ్యాహ్నము పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ, జాతీయ రహదారి అధికారులు, అధికారులతో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణ రెడ్డి మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ అమృత మహోత్సవం లో భాగంగా 90 లక్షల రూపాయల పనులు ప్రారంభించాలనీ, అవసరం అయితే ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రిని ఆహ్వానిస్తానని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందించే లక్ష్యంగా రెండు కోట్ల 50 లక్షల వ్యయంతో కొనసాగుతున్న పనులు తొందరగా పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. శానిటరీ అధికారులు శుభ్రత విషయంలో చర్యలు పాటించాలనీ అన్నారు. వర్షా కాలం దృష్ట్యా అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలనీ అన్నారు. ముఖ్యంగా డెంగ్యూ లాంటి వ్యాధి విషయంలో ప్రజలకు అవగాహన చేపట్టాలని అన్నారు.

## అంతిమంగా న్యాయమే గెలిచింది

- కవితకు బెయిల్ మంజూరు పట నాయకుల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని శివాలయం, హనుమాన్ ఆలయాల వద్ద బీఆర్ఎస్ నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులను తీర్చుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు శక్కరి కొండ కృష్ణ, సీనియర్ నాయకులు నల్లవెల్లి సాయిలు, నీరడి పద్మారావు, ఒడ్డం నర్సయ్య మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్ మాట్లాడుతూ.. కావాలనే కొన్ని రాజకీయ పార్టీలు బిఆర్ఎస్ పార్టీని దెబ్బ కొట్టడానికి శతవిధాల ప్రయత్నాలు చేశారని, తమ పార్టీల ఉనికి కాపాడుకోవడానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై లేనిపోని ఆరోపణలు చేసి జైలు పాలు చేశారని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా అంతిమంగా న్యాయమే గెలిచిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గీతా, గంగాధర్, సూదం, గంగభూషణ్, మోహన్, జాకిర్, పింటూ, వికాస్, భూమన్న, రాజేశ్వర్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ బాలుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రయివేటులోనే మృతిచెందినట్టు వైద్యుల వెల్లడి


చికిత్స పొందుతు మృతి చెందిన బాలుడు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

వైద్యుల నిర్లక్ష్యంతో బాలుడు మృతి చెందినట్టు కుటుంబీకులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పిట్లం మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన శంకర్, కృష్ణవేణి దంపతుల కుమారుడు హేమంత్(3)కు తీవ్ర జ్వరం రావడంతో సోమవారం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. కేవలం గ్లూకోజ్ పెట్టి వదిలేశారని, ఎలాంటి చికిత్స చేయలేదని తండ్రి ఆరోపించారు. రాత్రి వైద్యులెవరు పట్టించుకోకపోవడంతో మంగళవారం ఉదయం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. ఈ సంద్భంగా ఆసుపత్రి సూపర్ డెంట్ డాక్టర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ హేమంత్ ను వారి తల్లిదండ్రులు సోమవారం ఆసుపత్రికి తీసు కొచ్చారు. గత రెండు మూడు రోజులుగా పలు ప్రవేట్ ఆసుపత్రిలో చూపించా రు. తక్కువ కాకపోవడంతో ఇక్కడికి తీసుకొచ్చారు. అలాగే మంగళవారం ఉద యం 4 గంటలకు డిచ్చర్జ్ అయ్యారు. అలాగే బాన్సువాడ ఓ ప్రవేట్ ఆసుప త్రిలో చికిత్స పొందినట్లు సమాచారం. ప్రయివేటు ఆస్పత్రిలో బాలుడు మృతి చెందితే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి ఆందోళన చేస్తున్నారని, ఇక్కడే ఉంటే మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించే వారమని తెలిపారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఎమ్మార్వో కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా


ధర్నాలో పాల్గొన్న నాయకులు, రైతులుట

నవతెలంగాణ-మాచారెడ్డి(కామారెడ్డి)

పోడురైతులపై గతంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని మాచారెడ్డి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు మాట్లాడుతూ రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని, రైతుల పంటలను దున్నిన ఫారెస్ట్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఒకపక్క తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి పట్టాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు అక్రమ కేసులు బనాయించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నడిమీ తండకు సంబంధించి భూక్య నరహరి తండ్రి పూల్యా భూక్య మాన్సింగ్, భూక్య రవి లపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీల నాయకులు గిరిజనుల ఓట్ల కోసం హామీలిచ్చి గద్దలెక్కిన తర్వాత వారి సమస్యలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లిమ్యా నాయక్, నరహరి, మాన్సింగ్, మాలోత్ రాజు, భూక్య, బంగ్యా భూక్య దరి, భూక్య రవి, భూక్య వసరం, భూక్యచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఆర్మూర్ రూరల్ సిఐ కే.శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ/కమ్మర్‌పల్లి/ఏర్గట్ల

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆర్మూర్ రూరల్ సిఐ కే.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. సరైన సమయానికి నిమజ్జనం అయ్యే విధంగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నిమజ్జనం నాటికి వివిధ శాఖల అధికారులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేశ్వర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జయవంతరావు, కానిస్టేబుల్ సాయికుమార్, వివిధ మతపెద్దలు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లిలో శాంతి కమిటీ సమావేశం..**

**కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో మంగళవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఇన్చార్జి ఎస్ఐ విక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పండుగల నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలు, తదితరాంశాలపై శాంతి కమిటీ సభ్యులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విక్రమ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. గణేష్ ఉత్సవ కమిటీలు తప్పనిసరిగా గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమ్మర్పల్లి ఏఎస్సై షేక్ ఇస్మాయిల్, హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ఏర్గట్ల :** మండల కేంద్రంలో ఎస్సై బి.రాము శాంతి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాము యువజన సంఘాలను, గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసే వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. రాబోయే గణేష్ ఉత్సవాల్లో భాగంగా మండపాల నిర్వహణ, నిమజ్జన ఊరేగింపు శాంతియుతంగా జరుపుకోవాలని అన్నారు. శాంతి భద్రతల విషయంలో అన్ని గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.


బాల్కొండ: సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ


సిరికొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి


ధర్పల్లిలో...

## కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు

- కేటీఆర్, హరీష్‌రావ్ జైలుకే
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి/సిరికొండ

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై అబద్దాలు పలుకుతున్న బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని చూసి బిఆర్ఎస్, బిజెపి వారికీ మింగుడు పడటం లేదని విమర్శించారు. తొమ్మిదేండ్ల ప్రభుత్వంలో కేసీఆర్ ఒక్క ఉద్యోగమైనా ఇచ్చాడా..? ప్రజలు గమనించాలని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను దశల వారీగా ప్రజలకు చేరేవిధంగా కార్యాచరణ చేపడుతుందని అన్నారు, కార్యక్రమంలో ఐసిడిఎంఎస్ చైర్మెన్ తారాచంద్, సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్, మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, నాయకులు మనోహర్‌రెడ్డి, శుభాష్, మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్సయ్య, చెలిమెల శ్రీనివాస్, భగవాన్ రెడ్డి, రాజేందర్, లొక్కిడి రాములు, ఆనంద్, ఇంచార్జ్ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది రాజేందర్ రెడ్డి, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

**సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన..**

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతులకు గానూ మరో రూ.4.50 లక్షలతో విద్యార్థులకు వసతులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పిఎంఎస్ నిధుల నుంచి 18 లక్షలతో పాఠశాల మరింత అభివృద్ధి కానున్నదని అన్నారు. అలాగే మండల కేంద్రంలో రూ.10 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను ప్రారంభించారు. దీంతో పాటు మండల కేంద్రంలోని 4 ప్రాంతాల్లో ఐమాస్ట్ లైటు ఏర్పాటుకు 4 లైట్లను అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బోరు, మోటారుతో పాటు పంపు సెట్‌ను మంజూరు చేసి రెండు రోజుల్లో విద్యార్థులకు నీటిని అందించాలని అధికారులకు ఆదేశించారు.

**రైతులకు బాసటగా కాంగ్రెస్ ప్రభుత్వం..**

**సిరికొండ :** రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని కొండూర్, పెద్దవాల్గోట్ గ్రామాల్లోని సహకార సంఘం గోదాములో నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల, రైతుల ప్రభుత్వమని, భూ సమస్యలు పరిష్కారం చేస్తుందని అన్నారు. ఇప్పటివరకు 22 లక్షల మందికి రుణమాఫీ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. వచ్చే వరి పంటకు రూ.500 బోనస్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాకారం రవి, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారచంద్, సొసైటీ చైర్మన్ గంగాధర్, వెల్మ భాస్కర్ రెడ్డి, లియకత్ అలీ, ముప్పా గంగారెడ్డి, ఎర్రన్న, దేగం సాయిలు, ఆసిఫ్, గంగారెడ్డి, రాజు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 1న బామ్ సెఫ్ 11వ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ-కామారెడ్డి

బివిఎం ఆధ్వర్యంలో కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ కలిసి బామ్ సెఫ్ 11 వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ మాట్లాడుతు సెప్టెంబర్ 1న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే బామ్ సెఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ తో కలిసి కరపత్రలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల బివియం బాధ్యులు శివ కుమార్, శ్రవణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసి ప్రథమ సంవత్సరం గ్రూప్ లలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి జీపీఏ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థినిల టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జిరాక్సులు అందజేయాలని సూచించారు.